# ఆరే సంక్షేమ సంఘం గ్రామ కమిటీ ఏకగ్రీవం

## గ్రామ అధ్యక్షుడిగా వరికెల రాజు



**వరంగల్ వాయిస్, నడికూడ :** హనుమకొండ జిల్లా నడికూడ మండలం నర్సక్కపల్లి గ్రామంలో ఆరే సంక్షేమ సంఘం నూతన గ్రామ కమిటీ ఎన్నికలు గురువారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. గ్రామ పెద్దలు, కుల బాంధవుల సమక్షంలో జరిగిన ఈ ఎన్నికల్లో అందరూ ఏకాభిప్రాయానికి రావడంతో కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. గ్రామ గౌరవ అధ్యక్షులు నాగూర్ల ధర్మారావు పర్యవేక్షణలో ఎన్నికైన నూతన బాధ్యులు గ్రామ అధ్యక్షుడు వరికెల రాజు, ప్రధాన కార్యదర్శి సురావు బాబురావు, కోశాధికారి లోనే సతీష్, ఉపాధ్యక్షులు మొకిడి రాజన్న, ఎర్రబాటి వెంకటేశ్వర్లు, ఇటుకల నర్సింగరావు, సహాయ కార్యదర్శి ఓరవాలా రాజేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు కానువాలా శ్యాంరావు, నాగూర్ల అభినేష్, ఇటీకాల నాగరాజు, పుష్కారి విజయ్ భాస్కర్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను హనుమకొండ జిల్లా ముఖ్య సలహాదారు నాగూర్ల సంతోష్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు వరికెల కిషన్ రావు శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన కమిటీ గ్రామ ప్రజల సమస్యలపై స్పందిస్తూ, సంఘ అభివృద్ధికి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన సభ్యులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలుపుతూ, గ్రామ అభివృద్ధిలో ముందుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుల బాంధవులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నాగూర్లకు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్ డీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన నాగూర్ల వెంకటేశ్వర్లకు పరకాల ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ సీడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. నాగూర్ల వెంకటేశ్వర్లను గజమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పరకాల ఫర్టిలైజర్స్ ఫెస్టిసైడ్స్ సీడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించడంలో ఫర్టిలైజర్ షాపు వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అలాంటి బాధ్యతాయుతమైన పదవికి నాగూర్ల వెంకటేశ్వర్లు ఎన్నిక కావడం రైతు సమాజానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతుల సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా ఆయన సమర్థవంతంగా పనిచేస్తారని, ఫర్టిలైజర్ రంగంలో ఉన్న అనుభవం సేవాభావం నాయకత్వ లక్షణాలతో నాగూర్ల వెంకటేశ్వర్లు ఈ పదవికి పూర్తిగా న్యాయం చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అదేవిధంగా నాగూర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రైతు కుటుంబం నుంచి వచ్చిన తనకు రైతుల ఇబ్బందులు, ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ సీడ్స్ అమ్మకదారుల ఇబ్బందులు తెలుసన్నారు. అందరికీ న్యాయం జరిగేలా చేస్తానన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందని తెలియజేశారు. సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో అసోసియేషన్ భవన నిర్మాణానికి తన వంతు ఆర్థిక సాయం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ సీడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గందె వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వాడికారి శివాజీ, యర్రం లక్ష్మణ్ పరకాల ఫర్టిలైజర్ దుకాణ వ్యాపారులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థులందరికీ హాల్ టికెట్లు జారీ చేయాలి

- నిర్లక్ష్యం చేస్తే ఆందోళనలు తప్పవు
- ఏఐఎఫ్డీఎస్ నేత చుక్క ప్రశాంత్ హెచ్చరిక



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల నిర్లక్ష్యం వల్ల ఇంటర్మీడియట్ విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఏఐఎఫ్డీఎస్ వరంగల్ జిల్లా కార్యదర్శి చుక్క ప్రశాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వరంగల్ అండర్ రైల్వే బ్రిడ్జి సమీపంలోని ఓంకార్ భవన్‌లో జిల్లా కమిటీ సభ్యుడు వెనిష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చుక్క ప్రశాంత్ మాట్లాడుతూ ఈనెల 25 నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఇప్పటికీ 300 మందికి పైగా విద్యార్థులకు హాల్ టికెట్లు జారీ కాకపోవడం దారుణమన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తల్లిదండ్రుల వాట్సాప్ నంబర్లకు హాల్ టికెట్లు పంపే ప్రక్రియలో రిజిస్ట్రేషన్ పూర్తికాని కారణంగా చాలా మందికి హాల్ టికెట్లు అందలేదని, దీనివల్ల ఒక విద్యా సంవత్సరం వృథా అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో తక్షణమే స్పందించి ఈ క్రింది చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫీజు చెల్లించని విద్యార్థుల కోసం ప్రత్యేక విండో తెరిచి, తక్షణమే హాల్ టికెట్లు జారీ చేయాలి. సాంకేతిక కారణాల వల్ల హాల్ టికెట్లు రాని విద్యార్థులను పరీక్షలకు అనుమతించాలి. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు న్యాయం జరగని పక్షంలో ఏఐఎఫ్డీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పవన్, చరణ్, నాయకులు శివ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ ఖ్యాతిని రాష్ట్రస్థాయిలో చాటాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ (కొత్తవాడ):** సీఎం కప్ రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు వరంగల్ జిల్లా నుంచి ఎంపికైన వేల్పుల వికాస్ యాదవ్‌ను టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, 23వ డివిజన్ కాంటెస్ట్ కార్పొరేటర్ చిప్ప వెంకటేశ్వర్లు నేత ఘనంగా అభినందించారు. వరంగల్ కొత్తవాడ ప్రాంతానికి చెందిన వేల్పుల రాణి–అనిల్ యాదవ్ దంపతుల కుమారుడు వికాస్ యాదవ్, ఏవీవీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల బ్రిలియంట్ హైస్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి ఎంపికల్లో అద్భుత ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ నెల 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరగనున్న ఫైనల్ పోటీల్లో వికాస్ పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా చిప్ప వెంకటేశ్వర్లు నేత మాట్లాడుతూ.. "వికాస్ యాదవ్ మణి మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మాస్టర్ మణికంఠ శిక్షణలో రాటుదేలి, గతంలోనే ముంబై, గోవా, మధ్యప్రదేశ్, చెన్నై, కోల్‌కతా వంటి ప్రాంతాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడం గర్వకారణం" అని కొనియాడారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్న వికాస్, సీఎం కప్‌లో విజేతగా నిలిచి వరంగల్ జిల్లా పేరును రాష్ట్రవ్యాప్తంగా నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బొల్లు సురేష్, నంబి మురళి, దేవర రాము తదితరులు పాల్గొని వికాస్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# మెయిన్ కెనాల్ పనులు వెంటనే ప్రారంభించాలి

## మారుజోడు రాంబాబు



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘన్‌పూర్:** బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి మెయిన్ కెనాల్ ద్వారా మండలంలోని వివిధ గ్రామాలకు అందాల్సిన సాగునీరు అందక రైతులు పడుతున్న ఇబ్బందులపై జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మారుజోడు రాంబాబు స్పందించారు. గౌరవ శాసనసభ్యులు కడియం శ్రీహరి ఆదేశాల మేరకు గురువారం ఆయన స్థానిక నాయకులతో కలిసి కెనాల్‌ను పరిశీలించారు. మేకలగట్టు, ఆంధ్ర తండా, గిద్దబండ తండా, పొట్టిగుబ్బడి తండా, కొత్తగూడెం, కిలేషాపుర్, మండలగూడెం గ్రామాలకు వెళ్లే కాల్వలలో తుంగ, నాసు, సిల్టు (మట్టి) భారీగా పేరుకుపోయాయి. దీనివల్ల నీటి ప్రవాహం తగ్గి, చివరి ఆయకట్టు పొలాలకు నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మారుజోడు రాంబాబు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, పంటలను కాపాడుకోవడానికి తక్షణమే కాలువల పూడికతీత పనులు ప్రారంభించాలని సూచించారు. ఒకటి రెండు రోజుల్లోనే పనులు పూర్తి చేసి, రైతులకు సాగునీరు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలే ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రాధాన్యత అని ఆయన పేర్కొన్నారు.

# చదువుతోనే పేదరికాన్ని జయించగలం

- సర్పంచ్ ఏర్పుల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** చదువు అనే ఆయుధంతోనే పేదరికాన్ని జయించి, ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సోమారం గ్రామ సర్పంచ్ ఏర్పుల శ్రీనివాస్ అన్నారు. స్వేరోస్ పర్వతగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాబోయే పరీక్షలను పురస్కరించుకుని పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులకు సర్పంచ్ చేతుల మీదుగా ఎగ్జామ్ ప్యాడ్లను అందజేశారు. అదేవిధంగా పాఠశాలలో ఎవరికైనా శ్వాసకోస ఇబ్బందులు తలెత్తినప్పుడు తక్షణ వైద్య సహాయం కోసం నెబ్లైజర్ పరికరాన్ని పాఠశాల యాజమాన్యానికి బహూకరించారు. స్వేరోస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు దూడల సిద్దు, ప్రధాన కార్యదర్శి కందికట్ల ప్రవీణ్ మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో విద్యార్థినులు ఎటువంటి భయాందోళనలకు గురికావద్దని సూచించారు. ప్రశాంతమైన మనసుతో పరీక్షలను ఎదుర్కోవాలని, అప్పుడే మెరుగైన ఫలితాలు సాధించగలమని పేర్కొన్నారు. గర్ల్స్ కన్వీనర్ తేజస్విని, అధికార ప్రతినిధి గారె జయరాజ్ మాట్లాడుతూ.. అమ్మాయిలు విద్యార్థి దశ నుంచే మానసిక ఒత్తిళ్లను జయించడం అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి స్పెషల్ ఆఫీసర్ రజిత, స్వేరో నాయకులు జైపాల్, విజయ్, నవీన్, వినోద్, కేజీబీవీ సీఆర్‌టీలు స్వప్న, విజయ, శోభారాణి, రాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.